## బీఆర్ఎస్ కార్యకర్తలకు మాజీ మంత్రి పరామర్శ

మొట్టు ఆంజనేయులును పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, మే 9: మండల కేంద్రానికి చెందిన మొట్టు ఆంజనేయులు అనారోగ్యంతో బాధ పడుతున్నాడు, అలాగే బొక్కి రాములు ఆటో నుంచి కింద పడి చేతు విరిగింది. ఇద్దరు పార్టీ కార్యకర్తలు కావడంతో శుక్రవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారివారి ఇంటికెళ్లి పరామర్శించారు. ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని ఆధైర్యపడొద్దని సూచించారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణకర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, సింగిల్ విండో చైర్మన్ వెంకటయ్య, గ్రామాధ్యక్షుడు మాధవులుగౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ అరుణ్, నాయకులు ఆనంద్, బాలకిష్టయ్య, రావుల శ్రీను, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన దవాఖాన నిర్మాణం

దవాఖాన నిర్మాణ నమూనా చూస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

● మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, మే 9: మక్తల్‌లో చేపడుతున్న 150 పడకల దవాఖాన నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీహరి అన్నారు. శుక్రవారం ఉదయం మక్తల్ పట్టణంలో నిర్మిస్తున్న 150 పడకల దవాఖాన నిర్మాణం పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు చక్కటి ఆరోగ్యాన్ని అందించాలనే లక్ష్యంతో మక్తల్‌లో చేపడుతున్న 150 పడకల దవాఖాన నిర్మాణాన్ని నాణ్యతతో త్వరలోనే పూర్తి చేసి వైద్యారోగ్యశాఖకు అప్పగించే ప్రయత్నం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీటీసీ వెంకటేశ్, కట్ట వెంకటేశ్, సురేశ్‌గుప్తా, రంజిత్ రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

***ఎల్‌వోసీ అందజేత***

ఊట్కూర్, మే 9: మండలంలోని పగిడిమర్రికి చెందిన ఆశాబీ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.5లక్షల ఎల్‌వోసీని బాధితురాలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, రవి, నర్సింహ పాల్గొన్నారు.

## గుట్టమీదతండాలో రేషన్ పంపిణీ చేయాలి

ఎమ్మెల్యే యెన్నంకు వినతిపత్రం అందజేస్తున్న గుట్టమీదతండావాసులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 9: మహబూబ్‌నగర్ గ్రామీణ మండలం వెంకటాపూర్ ఆమ్లేట్ గుట్టమీదతండాలోనే రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన నాటినుంచి గుట్టమీద తండాలో కాకుండా రేగడిగడ్డ తండాలో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారని అన్నారు. దీంతో స్థానికంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని స్థానికులకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్థానిక అధికారులతో మాట్లాడారని సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు గుట్టమీది తండా వాసులు తెలిపారు.

## స్లాట్ బుకింగ్‌లో జాగ్రత్తలు తీసుకోవాలి

డాక్యుమెంట్ రైటర్లకు అవగాహన కల్పిస్తున్న రాంజీ

నారాయణపేట, మే 9 : ప్లాట్‌ల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకొని డాటా ఎంట్రీ చేయాలని పేట సబ్ రిజిస్ట్రార్ రాంజీ అన్నారు. శుక్రవారం స్లాట్ బుకింగ్ విధానంపై డాక్యుమెంట్ రైటర్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో ఈనెల 12 నుంచి ప్రతి రోజూ 48 స్లాట్ బుకింగ్‌లు మాత్రమే ఉంటాయన్నారు. ఈ నెల 12 నుంచి స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే రిజిస్ట్రేషన్‌లు చేస్తామన్నారు. స్లాట్ బుకింగ్ లేకుండా నేరుగా వస్తే రిజిస్ట్రేషన్‌లు చేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

● కలెక్టర్ విజయేందిరబోయి

మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 9 : అత్యవసర పరిస్థితుల్లో బాధపడే వారికి సహాయం అందించడంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ విజయేందిరబోయి అన్నారు. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో జరిగిన యూత్ రెడ్‌క్రాస్, జూనియర్ రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సేవకులు, తలసేమియా బాధితుల సమావేశానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తలసేమియాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నోబుల్ అవార్డు గ్రహీత జాన్ హెన్రీ డ్యూనాంట్ గొప్ప ఆశయంతో స్థాపించిన రెడ్‌క్రాస్ ప్రపంచ వ్యాప్తంగా నిస్వార్థంగా సేవలు అందిస్తూ ముందుకు సాగడం అభినందనీయం అన్నారు. జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు మరింత విస్తృతం చేయాలని సూచించారు. తలసేమియా బాధితులకు స్థానికంగా వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ చేపట్టే సేవా కార్యక్రమాలకు సంపూర్ణ సహకారం అందిమస్తామన్నారు. సమావేశంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ శామ్యూల్, కోశాధికారి జగపతిరావు, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు లయన్ రమణయ్య, జిల్లా సభ్యులు శశికాంత్, తిరుపతిరెడ్డి, యూత్, జూనియర్ రెడ్‌క్రాస్ సమన్వయకర్తలు బాబుల్‌రెడ్డి, అశ్విని చంద్రశేఖర్, మేనేజర్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

***కచ్చితమైన నివేదికలు ఉండాలి***

మూసాపేట, మే 9: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి ఫైలట్ ప్రాజెక్టు రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వస్తున్న ప్రతివినతికి కచ్చితమైన నివేదిక ఉండాలని కలెక్టర్ విజయయేందిర బోయి అధికారులకు సూచించారు. మండలంలోని నిజాలాపూర్, మహ్మద్‌హుస్సేన్‌పల్లిలో శుక్రవారం భూ భారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వస్తున్న దరఖాస్తులపై ఆరా తీశారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ సదస్సుకు వస్తున్న రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకోవడం కోసం ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్‌డెస్క్, దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన సదుపాయాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ రికార్డుల్లోని వివరాలను పక్కగా సేకరిస్తూ, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. భూ సమస్యలకు పరిష్కారం కోసమే నూతన ఆర్‌వోఆర్ చట్టం అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. రైతులు ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ రాజు, ఆయా మండలాల తాసీల్దార్లు, నాయబ్ తాసీల్దార్లు, ఆర్ఐలు, ఆయా గ్రామాల వివిధ పార్టీల నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నిజాలాపూర్ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

రెడ్‌క్రాస్ స్వచ్ఛంద సేవకులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

## పాఠశాల అభివృద్ధికి విరాళం

నవాబ్‌పేట, మే 9: మండలంలోని యన్మన్‌గండ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన రవీందర్‌గౌడ్ రూ.10వేలు విరాళం అందజేసినట్లు హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. రవీందర్‌గౌడ్ తల్లిదండ్రులైన సంయుక్తమ్మ, రాములుగౌడ్ స్మారకార్థం విరాళం అందజేసినట్లు వివరించారు. విరాళం అందజేసిన రవీందర్‌గౌడ్‌ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## జాతీయస్థాయి క్రీడాకారిణికి సన్మానం

అనూషను సన్మానిస్తున్న దృశ్యం

మక్తల్, మే 9: సౌత్ జోన్ జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థిని అనూషను శుక్రవారం సన్మానించినట్లు సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, విజయకాంతారావు ఆదేశాల మేరకు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మక్తల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి మౌంటేన్ సైక్లింగ్ పది కిలోమీటర్ల పోటీల్లో గోల్డ్ మెడల్, సౌత్ జోన్ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన నర్వ మండలంలోని రాయపాడుకు చెందిన విద్యార్థినీ అనూషను వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో క్రీడాకారుల మధ్య సన్మానించామన్నారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేశ్‌కుమార్, వాలీబాల్ కోచ్ రాఘవేందర్, క్రీడాకారులు ఉన్నారు.

## పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలి

● పేట ఎస్పీ యోగేశ్ గౌతం

నారాయణపేట రూరల్, మే 9 : చెక్ పోస్టుల వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పకడ్బందీగా తనిఖీలు చేపట్టాలని నారాయణ పేట ఎస్పీ యోగేశ్ గౌతం అన్నారు. శుక్రవారం జబాల్‌పూర్ చెక్ పోస్టు వద్ద ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నారాయణ పేట జిల్లాలో జలాల్‌పూర్, కాన్కుర్తి, కృష్ణ, చేగుంట, ఉజ్జెల్లీ, సమస్తన్‌పూర్ గ్రామాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, కర్నాటక నుంచి తెలంగాణకు అక్రమంగా వరి ధాన్యాన్ని తీసుకరాకుండ తగు చర్యలు తీసుకుంటున్నమని తెలిపారు. చెక్ పోస్టుల వద్ద ఎవైనా సమస్యలు ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

నారాయణపేట టౌన్, మే 9 : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకిషన్ అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో తెలంగాణ నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తసంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తహీనత గల తల్లులకు, అత్యవసర పరిస్థితుల్లో బ్లడ్ ట్రాన్స్‌ఫర్ అవసరమయ్యే రోగులకు రక్తం ఎక్కించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు నర్సింహాజీవన్, రాఘవేంద్ర, ఎన్‌వోఏ ప్రెసిడెంట్ కవిత, జనరల్ సెక్రటరీ రాజు పాల్గొన్నారు.

## బాల కార్మికులు కనిపించొద్దు

నారాయణపేట, మే 9 : జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే, బాల్య వివాహాలు జరుగుతున్నా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని చైల్డ్ హెల్ప్ లైన్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ నర్సింహులు, ప్రొటెక్షన్ ఆఫీసర్ కరిష్మా అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నజట్రం గ్రామంలో ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు బాల కార్మికులు, బాల్యవివాహాలు, 1098పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలల రక్షణ, సంరక్షణ కోసం చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఎల్లవేళలా పని చేస్తుందన్నారు.

## ప్రతి విద్యార్థికి మెడికల్ ఐడీ ఉండాలి

మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

నారాయణపేట టౌన్, మే 9 : ప్రతి విద్యార్థి వ్యక్తిగత ఆరోగ్య సమాచారం కోసం ప్రత్యేక మెడికల్ ఐడీ ఉండాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా మొబైల్ హెల్త్ టీం ద్వారా ఆరోగ్య సమస్యలు పరిష్కరించేందుకు వీలు కలుగుతుందన్నారు. విద్య, వైద్య శాఖలు సమన్వయంతో పనిచేసి ఆర్‌బీఎస్‌కే కార్యక్రమాన్ని మరింతగా మెరుగుపరచాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య సమాచారం మరింత స్పష్టంగా ఉండేలా వెబ్ పోర్టల్‌లో తగిన మార్పులు చేయాలన్నారు. ఆర్‌బీఎస్‌కే మొబైల్ హెల్త్ టీం ద్వారా స్క్రీనింగ్, ట్రీట్మెంట్, రిఫరల్ తదితర అంశాలపై సూచనలు అందజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఎంహెచ్‌వో జయచంద్రమోహన్, కోఆర్డినేటర్ శైలజ, సూపర్‌వైజర్ గోవిందరాజు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంబాలకు అండగా ఉంటాం

నారాయణపేట టౌన్, మే 9 : జిల్లాలో మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలకు ప్రభుత్వం తరపున వచ్చే సంక్షేమ ఫలాలను అందిస్తూ టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా శాఖ అండగా ఉంటుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. జిల్లాకు చెందిన జర్నలిస్టులు మహేశ్, రాఘవేందర్ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ భవన్‌లో జరిగిన జర్నలిస్టుల సంక్షేమం ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యం అనే కార్యక్రమంలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబ సభ్యులకు జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కులను ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు నారాయణరెడ్డి మాట్లాడుతూ మృతుల పిల్లల చదువు కోసం నెలకు రూ.వెయ్యి, మృతుని భార్యకు రూ.3వేల పెన్షన్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రఘు, శ్రీనివాస్, రాజేశ్, సంజీవ్‌ప్రకాశ్ పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

## సీహెచ్ పట్టివేత: ఒకరిపై కేసు నమోదు

మాగనూరు, మే 9: మండలంలో సీహెచ్ అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన మండలంలోని నేరడగండొడ్డిలో శుక్రవారం చోటుచేసుకున్నది. టాస్క్‌ఫోర్స్ సీఐ కవిత కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు నేరడగండొడ్డిలో తనిఖీలు నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన ఈడిగి అశోక్‌గౌడ్ క్లోరో హైడ్రేడ్ ద్రావణాన్ని (సీహెచ్) ప్రజలు తాగే ఈతకల్లులో వాడుతున్నట్లు, అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు కొన్ని రోజులుగా అతినిపై నిఘా ఉంచామన్నారు. అయితే శుక్రవారం ఉదయం 10గంటలకు ఎస్సై రాజేందర్‌రెడ్డి బృందంతో అశోక్‌గౌడ్ ఇల్లు, కల్లు, ఈదుల్లో తనిఖీలు చేపట్టి 580గ్రాముల సీహెచ్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అశోక్‌గౌడ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. అశోక్‌గౌడ్ అమ్మను తీసుకెళ్లి నారాయణపేట ఎక్సేంజ్ పోలీస్‌స్టేషన్లో అప్పజెప్పి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ బృందం రియాజ్, యేలియా, మహేశ్, జమిందార్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌గౌడ్ తల్లితో టాస్క్ ఫోర్స్ సిబ్బంది

## అక్రమ వెంచర్లు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జడ్చర్ల, మే 9: మండలంలో దేవాదాయ, భూదాన్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ చేసి వెంచర్లు వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం శుక్రవారం డిప్యూటీ తాసీల్దార్ కిశోర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ మాట్లాడుతూ జడ్చర్ల మండలంలోని భూదాన్, దేవాలయ భూములైన సర్వేనెంబర్ 138, 29, 31,33, 115, 116లో అక్రమంగా పట్టాలు చేయించుకుని ఆ భూముల్లో వెంచర్లు వేసిన వారిపై కఠినచర్యలు తీసకోవాలని డిమాండ్ చేశారు. భూదాన్, దేవాలయ భూముల్లో అక్రమార్కుల నుంచి వారి పట్టాలను రద్దుచేసి అర్హులైన పేదలకు ఇంటిస్థలాలు ఇవ్వాలని కోరారు. పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వని పక్షంలో సీపీఐ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రత్యక్ష పోరాటానికి దిగి ఆ భూములలో పేదలతో గుడిసెలు నిర్మిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, సత్యనారాయణరెడ్డి, పూజ, హనుమంతు, శంకరయ్య, వెంకటయ్య, ఇస్తారయ్య, దాసు తదితరులు ఉన్నారు.

## 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలి

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), మే 9: కౌకుంట్ల మండల కేంద్రానికి 108 అంబులెన్స్ సత్వరమే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చందుగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ. కౌకుంట్ల మండలం ఏర్పాటై దాదాపుగా మూడేండ్లు కావొస్తుందని, ఇప్పటి వరకు మండలానికి రావాల్సిన అన్నిశాఖల కార్యాలయాలు ఏర్పాటు చేయకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కౌకుంట్లలో ప్రభుత్వ దవాఖానను అప్‌గ్రేడ్ చేసి, వెంటనే అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

## పాక్ దుశ్చర్యలను తిప్పికొట్టాలి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 9 : పాక్ దుశ్చర్యలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తిప్పికొడుతూ ఎటువంటి ప్రాణ; ఆస్తి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లె గోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కురుమూర్తి, పద్మ, కిష్టయ్య, ఖమర్‌అలీ, చంద్రకాంత్, ప్రశాంత్, వి.జనార్ధన్, ఖాజా మైనుద్దీన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి

భూత్పూర్, మే 9: మండలంలోని అన్నాసాగర్ శివారులో గురువారం ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ యనమల రామసంజీవరెడ్డి(35)మృతిచెందాడు. బంధువుల కథనం ప్రకారం.. మృతుడు రామసంజీవరెడ్డి వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన వ్యక్తి. మార్చి నెల నుంచి నారాయణపేట జిల్లా కోస్గి ప్రాంతంలో ట్రాక్టర్, ట్రాలీతో పనులు చేస్తున్నాడు. కోస్గిలో పనులు లేక పోవడంతో వేరే ప్రాంతం చౌడూరుకు వెళ్తుండగా.. అన్నాసాగర్ శివారులో జాతీయ రహదారి44 పక్కనే ఉన్న ఇనుప రేలింగ్‌కు ట్రాక్టర్ ఢీ కొనడంతో ట్రాక్టర్ పైనుంచి కింద పడడంతో ట్రాక్టర్ టైర్ మృతుడి పైనుంచి వెళ్లింది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## రేకులపై నుంచి పడి కార్మికుడు..

బాలానగర్, మే 9: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉడిత్యాల శివారులో ఓ పరిశ్రమ గోదాము రేకులపై నుంచి పడి శుక్రవారం నేపాల్‌కు చెందిన కార్మికుడు మృతిచెందాడు. నేపాల్‌కు చెందిన కార్మికుడు (24) 25 రోజుల కిందట గోదాంలో పనికి చేరాడు. గోదాంలోని సరుకులను ఇతర ప్రాంతానికి తరలించే క్రమంలో ఉదయం 10 గంటల ప్రాంతంలో రేకులపై పనిచేస్తుండగా రేకుల మధ్యలో గాలి, వెలుతురు కోసం ఏర్పాటు చేసిన పలుచటి రేకులపై కాలు పెట్టడంతో ఒక్కసారిగా కిందపడిపోయి మృతి చెందాడు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం మృతదేహాన్ని శవపరీక్ష కోసం మహబూబ్‌నగర్ దవాఖాన మార్చురీకి తరలించారు.

## వృద్ధుడు అదృశ్యం: కేసు నమోదు

జడ్చర్లటౌన్, మే 9: మండలంలోని శంకరాయపల్లితండాకు చెందిన అంగోత్ పర్య(68) అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మండలంలోని శంకరాయపల్లితండాకు చెందిన అంగోత్ పర్య అనే వృద్ధుడు ఈనెల 6వ తేదీన టీ తాగేందుకు జడ్చర్లకు వెళ్లొస్తానంటూ ఇంటినుంచి వెళ్లి తిరిగిరాలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో వృద్ధుడి భార్య లక్ష్మి శుక్రవారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ప్రభుత్వ బడిలోనే చదవాలి

మక్తల్, మే 9: ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యభ్యసించేలా ఉపాధ్యాయులు చర్యలు చేపడుతున్నామని మక్తల్ మండలంలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మక్తల్ మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యాశాఖ ఆదేశాల మేరకు పేరెంట్ టీచర్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పిల్లవాడు ప్రభుత్వ పాఠశాలకు వచ్చేవిధంగా ప్రత్యేకమైన ప్రణాళికలను రూపొందించి, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటామని తల్లిదండ్రులకు తెలియజేశారు. తెలంగాణ విద్యాశాఖ ఆదేశాల మేరకు జూన్ 12వ తేదీ వరకు ప్రతి శుక్రవారం గ్రామాల్లో గ్రామ పెద్దలు, విద్యావంతుల సహకారంతో పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విధంగా తల్లిదండ్రులకు అవేర్నెస్ తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

రేడియం స్టిక్కర్లను అతికిస్తున్న సీఐ రామ్‌లాల్

మక్తల్, మే 9: రోడ్డు ప్రమాదాల నివారణకు మక్తల్ సర్కిల్ పరిధిలో పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు సీఐ రామ్‌లాల్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారి 167పై రోడ్డు ప్రమాదాల నివారణ గురించి వాహనదారులకు రేడియం స్టిక్కర్లు అందజేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జాతీయ ప్రధాన రహదారిపై రైతులు ధాన్యాన్ని ఆరబోసి ట్రాక్టర్లు, బైకులు, ఆటోలను రోడ్డుపై అడ్డం పెట్టడంతో రాత్రిళ్లు ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతునానయని, ప్రమాదాలను నివారించడానికి వాహనాలకు రేడియం స్టిక్కర్లను అతికించినట్లు సూచించారు. రైతులు సాధ్యమైనంత వరకు రోడ్లపై ధాన్యం ఎండబెట్టకూడదని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# వీరజవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి

భూత్పూర్, మే 9: ఆపరేషన్ సిందూర్ యుద్ధంలో భాగంగా పాకిస్తాన్ జరిపిన కాల్పుల్లో వీర మరణం చెందిన మురళీనాయక్‌కు భూత్పూర్ చౌరస్తాలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాము రాథోడ్ ఆధ్వర్యంలో జై భారత్, జిందాబాద్–జిందాబాద్ భారత ఆర్మీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

***అమర జవాను మృతికి సంతాపం***

బాలానగర్, మే 9: ఆపరేషన్ 'సిందూర్' పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లాకు చెందిన మురళీనాయక్ మృతికి సంతాపంగా శుక్రవారం సాయంత్రం బాలానగర్ మండల కేంద్రంలో యువకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్‌లోని టెర్రరిస్టుల స్థావరాలను ధ్వంసం చేయడంతోపాటు, టెర్రరిస్టులను పూర్తిస్థాయిలో అంతం చేయాలని కోరుతూ ఆపరేషన్ సిందూర్, భారతదేశ త్రివిధ దళాల సైన్యానికి మద్దతుగా బాలానగర్ చౌరస్తా నుంచి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు యువకులు ర్యాలీ నిర్వహించారు. అమరుడైన మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థనలు చేశారు. ఎస్సై లెనిన్, పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

***దేశం, సైనికుల రక్షణకు ప్రత్యేక పూజలు***

జడ్చర/జడ్చర్ల టౌన్, మే 9: దేశ రక్షణ, సైనికులకు రక్షణ కల్పించాలంటూ శుక్రవారం జడ్చర్లలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో సంస్కారభారతి, విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణ ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. భారత సైనికులు విజయం సాధించాలని, ఆరోగ్యంగా ఉండాలని కోరారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించుకున్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్, సంస్కారభారతి సభ్యులు లావణ్య, అలివేలమ్మ, గోనెల రాధాకృష్ణ, విద్యానగర్ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్లలోని ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

బాలానగర్‌లో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

భూత్పూర్ చౌరస్తాలో కొవ్వత్తులతో నివాళులర్పిస్తున్న వివిధ పార్టీల నాయకులు